సాక్షి
తిరుపతి
శనివారం । 17 । జూన్ । 2023



అడుగడుగునా బ్రహ్మారథం

పాకాలలో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చేపట్టిన గడపగడపకు మహా పాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. - 8లో



సద్వినియోగం చేసుకోండి

కండలేరు జలాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగు గంగ ఎస్‌ఈ హరినారాయణరెడ్డి సూచించారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	41	28
చిత్తూరు	40	27
తిరుమల	36	23
గూడూరు	43	30
నగరి	42	28

న్యూస్‌రీల్

రేణిగుంట తహసీల్దార్ బదిలీ

తిరుపతి అర్బన్: రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్ బదిలీ అయ్యారు. ఆయన కలెక్టరేట్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు వెలువడ్డాయి. కలెక్టరేట్ డీ సెక్షన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న భార్గవి రేణిగుంట తహసీల్దార్‌గా నియమితులయ్యారు. ఆ మేరకు ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వద్దకు చేరింది. గురువారం అర్ధరాత్రి వరకు 70,896 మంది స్వామివారిని దర్శించుకోగా.. 37,546 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.4.07 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతుండగా.. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది.

జలవనరులశాఖ సీఈగా వెంకటరమణ



తిరుపతి అర్బన్: తిరుపతి జోనల్(తిరుపతి–నెల్లూరు జిల్లాలు) జలవనరులశాఖ చీఫ్ ఇంజినీర్‌గా(సీఈ)ఎం.వెంకటరమణ బాధ్యతలు స్వీకరించారు. కడప జిల్లా ఎస్‌ఈగా పనిచేస్తున్న ఈయన తిరుపతి జిల్లా ఎస్‌ఈగా నియమితులయ్యారు. అంతేకాకుండా సీఈగా అదనపు బాధ్యతలు అప్పగించారు. తెలుగుగంగ ప్రాజెక్టుతోపాటు తిరుపతి జోనల్ పరిధిలోని ఇతర ప్రాజెక్టులు మైనర్ ఇరిగేషన్ వ్యవహారాలు ఈయన పరిధిలోనే ఉంటాయి. మరోవైపు అనంతపురంతోపాటు తిరుపతి జోనల్ సీఈగా పనిచేస్తున్న శ్రీనివాసులురెడ్డిని అనంతపురానికే పరిమితం చేశారు. తిరుపతి జిల్లా ఎస్‌ఈగా పనిచేస్తున్న రాజరాజేశ్వరిని విజయనగరం జిల్లాకు బదిలీచేశారు. ఈ సందర్భంగా ఎం.వెంకటరమణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు తెలుగుగంగ నీటిని ఇస్తున్న నేపథ్యంలో ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

జిల్లాకు ఇద్దరు ఉద్యానవన శాఖ అధికార్లు

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లాలో ఖాళీగా ఉన్న వెంకటగిరి, సూళ్లూరుపేట హార్టికల్చర్ ఆఫీసర్లను ప్రభుత్వం భర్తీ చేసిందని జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి శుక్రవారం తెలిపారు. వెంకటగిరి హార్టికల్చర్ ఆఫీసర్‌గా జి.ఆనంద్‌రెడ్డి, సూళ్లూరుపేట హార్టికల్చర్ ఆఫీసర్‌గా వై.యామిని నియమితులయ్యారని పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 11 హార్టికల్చర్ ఆఫీసర్ల (హెచ్‌వో పోస్టులు)భర్తీ అయ్యాయన్నారు.

నోటీస్ ఇవ్వకుండా ఓటర్లను తొలగించరాదు



ఎన్నికల ప్రధాన అధికారి సమీక్షలో జిల్లా అధికారులు

తిరుపతి అర్బన్: నోటీస్ ఇవ్వకుండా సుమోటోగా ఓటర్లు తొలగించరాదని ప్రధాన ఎన్నికల అధికారి ముఖేషకుమార్ మీనా స్పష్టం చేశారు. శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో ఓటర్ల ప్రక్రియపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు ఇంటింటా వెళ్లి కచ్చితమైన నివేదిక ఇవ్వాలని సూచించారు. ఓటర్ల చేరికలు 4 శాతంకన్నా ఎక్కువ ఉంటే వాటిని ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. 2 శాతంకంటే ఎక్కువ ఉంటే జాగ్రత్తగా పరిశీలించాలని చెప్పారు. ఒకే ఇంటి నంబర్ మీద అడ్రస్‌లో 10 మంది కన్నా ఎక్కువ ఓటర్లు నమోదు ఉంటే తప్పనిసరిగా పరిశీలించాలన్నారు. లింగ నిష్పత్తి 1,020 మించి ఉన్న వాటిని జాగ్రత్తగా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ ఏడాది జనవరి 5వ తేదీకి ఓటర్ల తుది జాబితా మేరకు జిల్లాలో 53,585 మంది యువ ఓటర్లు ఉన్నారని వెల్లడించారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ఆర్డీవోలు కనకనరసారెడ్డి, కిరణ్‌కుమార్, రామారావు, ఏఈఆర్‌ఓలు, ఎన్నికల సెక్షన్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా వీఆర్వోల బదిలీ

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో భారీగా వీఆర్వోలను బదిలీ చేస్తూ కలెక్టర్ షణ్మోహన్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్‌–1 వీఆర్వోలు 84 మంది చిత్తూరు జిల్లా పరిధిలో, అంతర్‌జిల్లా బదిలీల్లో అన్నమయ్య జిల్లా నుంచి చిత్తూరు జిల్లాకు ఇద్దరిని బదిలీ చేశారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.



తగలబడుతున్న ఫొటోఫ్రేమ్ దుకాణం



ఎగసిపడుతున్న అగ్నికీలలు



మంటలను అదుపు చేస్తున్న సిబ్బంది

గుండె మంటలు!

- తిరుపతిలో భారీ అగ్నిప్రమాదం
- ఫొటోఫ్రేమ్ దుకాణంలో షార్ట్ సర్క్యూట్
- ఎగసిపడిన అగ్నికీలలు
- ఐదు గంటల పాటు భయంభయం
- గోవిందుని రథానికి తప్పిన ప్రమాదం
- సోషల్ మీడియా వదంతులపై టీటీడీ ఈఓ అసహనం

తిరుపతి క్రైమ్: గోవిందరాజస్వామి ఆలయ ముందు భాగం, జీకార్ స్ట్రీట్‌లోని లావణ్య ఫొటో ఫ్రేమ్ షాపు అగ్నికి ఆహుతైంది. పక్కనే ఉన్న ఇళ్లకూ మంటలు వ్యాపించాయి. అప్పటికే అప్రమత్తమైన అధికారులు ప్రజలను సురక్షితంగా తరలించారు. తక్షణం ఫైరింజిన్లు రప్పించి మంటలను అదుపుచేశారు. సుమారు రూ.25 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు షాప్ యజమాని శంకర్ నాయుడు తెలిపారు.

ఎంతో ఫేమస్

తిరుపతిలో లావణ్య ఫొటో ఫ్రేమ్ ఎంతో ఫేమస్. ఇక్కడ రూ.10 నుంచి లక్షల విలువచేసే ఫ్రేమ్‌లు దొరుకుతాయి. మూడంతస్తుల్లోనూ కోట్ల రూపాయల విలువైన ఫొటో ఫ్రేమ్‌లను భద్రపరిచారు. కొన్ని బంగారు తాపడం, మరికొన్ని బంగారు దేవుళ్ల ఫొటోలు తయారుచేసి విక్రయించడానికి సిద్ధంగా ఉంచారు. ఒక్కసారిగా బిల్డింగ్‌తో పాటు అనేక వస్తువులు కాలిబూడిదయ్యాయి.

మంటలు పెరగడానికి ఇవే కారణం

ఫొటో ఫ్రేమ్ షాపు కావడం.. సింథటిక్, స్పాంజ్, ప్లాస్టిక్, రెగ్జిన్ ఫ్రేమ్‌లు తయారుచేసే మెటీరియల్ అధికంగా నిల్వ చేర్చారు. దీనికి తోడు ప్లైవుడ్ షీట్లు, టేక్ వుడ్, ఇలా రకరకాల కలప ఉండడంతో మంటలు పెద్ద ఎత్తున ఎగసి పడ్డాయి.

మంటల్లో మూడు ద్విచక్ర వాహనాలు దగ్ధం

షార్ట్ సర్క్యూట్ కారణంగా పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో చుట్టుపక్కల షాప్ యజమానులు షాపులు మూసివేసి దూరంగా వెళ్లిపోయారు. లావణ్య ఫొటో ఫ్రేమ్ షాప్ ముందు భాగంలో పార్క్ చేసిన మూడు ద్విచక్ర వాహనాలు కాలిబూడిదయ్యాయి.

కూతవేటు దూరంలో చెక్కరథం

ఘటనా స్థలానికి కూతవేటు దూరంలోనే శ్రీ గోవిందరాజ స్వామి చెక్క రథం ఉంది. అయితే ఈ రథానికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా టీటీడీ, పోలీసులు, ఫైర్ అధికారులు అప్రమత్తమై రథాన్ని పక్కకు జరిపారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. కొందరు సోషల్ మీడియాలో గోవిందరాజు స్వామి వారి రథం కాలిపోయిందంటూ అవాస్తవాలను పోస్ట్ చేశారు. దీనిపై టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వాటిని నమ్మొద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు.



ఫైరింజన్‌ను నెట్టుతున్న ఎమ్మెల్యే భూమన

ఐదు గంటల పాటు శ్రమించి..

ఐదు గంటల పాటు శ్రమించి మంటలను అదుపు చేశాం. తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, పాకాల ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజిన్లు వచ్చాయి. మాకు నీరు అయిపోకుండా.. టీటీడీ తిరుపతి కార్పొరేషన్ వారు నిరంతరం అందజేశారు. అన్నీ కూడా కలపతో తయారు చేసిన వస్తువులు కావడంతో మంటలు పెద్ద ఎత్తున వ్యాపించాయి.

– ఎస్ కిరణ్‌కుమార్‌రెడ్డి, తిరుపతి ఫైర్ అధికారి



తరలివచ్చిన ఫైరింజన్లు

నేను సేఫ్



గోవిందరాజస్వామి రథం వద్ద టీటీడీ ఈఓ ధర్మారెడ్డి, ఎమ్మెల్యే భూమన, మేయర్ శిరీష

బాబు మైండ్ గేమ్

కుప్పం పర్యటనలో చంద్రబాబు మరో సారి మైండ్‌గేమ్ ఆడారు. మూడు రోజుల పర్యటన ఖరారు కావడంతో కార్యకర్తలంతా అధినేత వద్ద తమ అసంతృప్తిని వ్యక్తం చేయాలని నిర్ణయించుకున్నారు. విషయం తెలుసుకున్న చంద్రబాబు స్థానిక నాయకులపై చిందులేసి కార్యకర్తల నోరు మూయించారు. జన సమీకరణ కోసం డబ్బు, బిర్యానీ పంచి కార్యక్రమాన్ని మమ అనిపించి వెళ్లిపోయారు. కుప్పం పర్యటనకు వచ్చిన ప్రతిసారీ జరిగే తంతేనని స్థానికులు ఉసూరుమంటూ వెనుదిరిగారు.

- అధినేతను నిలదీసేందుకు అసంతృప్తుల యత్నం
- ముందే తెలుసుకుని నాయకులపై చంద్రబాబు ఆగ్రహం
- కుప్పంకు వచ్చిన ప్రతిసారీ ఇదే తరహా నాటకాలు
- కార్యకర్తలను నోరెత్తకుండా చేసి.. పబ్బం గడుపుకుని వెళ్తున్న వైనం
- డబ్బు, బిర్యానీతో ముగిసిన మూడు రోజుల కుప్పం పర్యటన
- ఉత్తుత్తి చేరికలతో హడావుడి



సాక్షి, తిరుపతి: చంద్రబాబు కుప్పం నుంచి ఇప్పటి వరకు ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. అందులో మూడు పర్యాయాలు ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈ సమయంలో కుప్పాన్ని, పార్టీ శ్రేణులకు ఎన్నో రకాలుగా మంచి చేసే అవకాశం ఉన్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. పార్టీ బాధ్యతలను కొంతమందికి అప్పగించి కార్యకర్తలను పక్కన బెట్టేవారు. స్థానిక నాయకుల స్వార్థ ప్రయోజనాలను గ్రహించిన కార్యకర్తలు ఈ మూడు రోజుల పర్యటనలోనైనా నిలదీయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని ముందే గ్రహించిన చంద్రబాబు కుప్పం చేరుకున్న మొదటి రోజే నాయకులు, కార్యకర్తల సమక్షంలో పీఎస్ మునిరత్నం, పీ మనోహర్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రాజ్‌కుమార్, త్రిలోక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటి వరకు 'మీరు చేసిన ఘన కార్యాలు చాలు.. ఇక మీరు దయచేయండి. మీ ముఖం చూపించకండి' అంటూ మండిపడ్డారు.

అనుకున్నట్టే ఎమ్మెల్సీకే కుప్పం బాధ్యతలు

మొన్నటి వరకు ఉన్న పార్టీ నాయకులపై తీవ్ర అసంతృప్తితో ఉన్న కార్యకర్తలను చల్లబరిచేందుకు వారిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు నటించి.. ఇదే అదునుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌కు కుప్పం బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామం కూడా చంద్రబాబు మైండ్ గేమ్ ప్లాన్‌లో భాగమేనని పార్టీ శ్రేణులు చర్చించుకుంటున్నారు.

ముక్కున వేలేసుకున్న పార్టీ శ్రేణులు

చంద్రబాబు నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కార్యకర్తలు చల్లబడిపోయారు. నిలదీయాలనుకున్న ప్రయత్నాన్ని విరమించుకున్నారు. మండలాల వారీగా నిర్వహించిన సమీక్షల్లో చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలతో ఊదరగొట్టారు. పార్టీ ఆధ్వర్యంలో పెట్టిన బిర్యానీ తిని ఇంటి ముఖం పట్టారు. చంద్రబాబు వచ్చిన ప్రతిసారీ ఇదే జరుగుతోందని గుడుపల్లికి చెందిన టీడీపీ శ్రేణులు చర్చించుకుంటూ వెళ్లడం కనిపించింది. తమ సాధక బాధకాలను ఎవరికి చెప్పుకోవాలంటూ ఊసురుమంటూ వెనుదిరిగారు.

ఉత్తుత్తి చేరికలు

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చంద్రబాబు సమక్షంలో టీడీపీ కండువాలు కప్పుకోనున్నారంటూ గత కొద్దిరోజులుగా ఎల్లో బ్యాచ్ ఊదరగొట్టింది. చివరకు టీడీపీ కండువా కప్పుకుంది కాంగ్రెస్ పార్టీకి చెందిన డాక్టర్ సురేష్, అతని అనుచరులు సుమారు వంద మంది ఉంటారు. అయితే వీరి చేరికతో కుప్పంలో వైఎస్సార్‌సీపీకి వచ్చిన నష్టం ఏమీ లేదు. ఇతనితో పాటు కొత్తపేటకు చెందిన కణ్ణన్ చేరినట్లు ప్రచారం చేసుకున్నారు. కానీ కణ్ణన్ గతకొంత కాలంగా టీడీపీలోనే ఉన్నారు. టీడీపీ నాయకుల ఒత్తిడితో ఇటీవల విజయవాడుకు వెళ్లి చంద్రబాబు సమక్షంలో కండువా కప్పుకున్నారు. అదే కణ్ణన్ తాజాగా పార్టీలో చేరినట్లు ప్రకటించుకున్నారు. ఇదిలా ఉంటే.. చంద్రబాబు మరికొందరి పేర్లు చదువుతూ వారంతా వైఎస్సార్‌సీపీ వారేనని, టీడీపీలో చేరినట్లు ప్రకటించుకున్నారు. అయితే అక్కడ డాక్టర్ సురేష్, వారి అనుచరులకు తప్ప మిగిలిన వారెవ్వరూ కనిపించలేదు. అనుచరుల పేరుతో వచ్చిన వారిలో ఎక్కువ మంది సాధారణ జనం కనిపించారు.

స్పందన కరువు

మూడు రోజుల చంద్రబాబు కుప్పం పర్యటనకు స్పందన అంతంతమాత్రమే. వారం పది రోజుల పాటు ఊదరగొట్టినా.. బస్టాండ్ వద్ద జరిగిన బహిరంగ సభకు అద్దె జనమే దిక్కైంది. ఒక్కొక్కరికి రూ.500, బిర్యానీ ఇచ్చి పక్క రాష్ట్రాల నుంచి పిలిపించుకున్నా.. చంద్రబాబు ప్రసంగం ప్రారంభించిన వెంటనే ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. ఇదే బస్టాండ్ వద్ద గతంలో నిర్వహించిన సభకు వచ్చిన జనంలో సగం మంది కూడా రాకపోవడం గమనార్హం.

వెండి బిందె బహూకరణ



బిందెను ఏఈఓకు అందిస్తున్న దాత కుటుంబ సభ్యులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి హైదరాబాద్ గచ్చిబౌలికి చెందిన కంభంపాటి జయరాం వెండి అష్టలక్ష్మీ బిందెను బహూకరించారు. శుక్రవారం దేవస్థానం ఏఈఓను కలిసి 2కిలోల 400 గ్రాముల వెండితో తయారు చేసిన అష్టలక్ష్మీ బిందెను అందించారు.

వర్సిటీ అభ్యున్నతికి కృషి

- పద్మావతీ మహిళా వర్సిటీ వీసీగా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ భారతి



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న దేపూరు భారతి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఎంతో ఉన్నతాశయంతో నెలకొల్పిన శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం అభ్యున్నతికి అందరి సహకారంతో కృషి చేస్తానని ప్రొఫెసర్ దేపూరు భారతి తెలిపారు. వర్సిటీ వీసీగా శుక్రవారం ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ కే.రాజారెడ్డి నుంచి ఆమె బాధ్యతలు తీసుకున్నారు. తిరుపతి జిల్లా వడమాలపేట మండలం, వడయాల గ్రామానికి చెందిన ఆమె ఎమ్మెస్సీ జువాలజీ దార్వాడ్ యూనివర్సిటీ, ఎంఫిల్ పీహెచ్‌డీ ఎస్వీయూ, పోస్ట్ డాక్టోరియల్ డిగ్రీని చైనా నుంచి పొందారు. 1987లో మహిళా వర్సిటీ సెరికల్చర్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. 1993లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా, 2001లో ప్రొఫెసర్‌గా ఆమె పదోన్నతి పొందారు. అదే వర్సిటీలో అకడమిక్ డీన్, సైన్స్ కళాశాల డీన్, ఎగ్జామ్స్ డీన్, సెరికల్చర్, జువాలజీ, బయోటెక్ విభాగాధిపతులుగా, ఎస్వీ జూ అడ్వైజరీ కమిటీ సభ్యురాలిగా వివిధ హోదాల్లో విధులు నిర్వర్తించారు. 35 ఏళ్ల సుదీర్ఘ బోధన, 40 ఏళ్ల పరిశోధనా అనుభవం కలిగిన ఆమె 4 పుస్తకాలు రాశారు. 147 పరిశోధనా పత్రాలు ప్రచురితమయ్యాయి. 2008లో బెస్ట్ టీచర్ అవార్డు, 2017లో ఇస్కా సదస్సులో ఉమెన్ సైన్స్ కాంగ్రెస్ కో–ఆర్డినేటర్‌గా పనిచేశారు. కర్ణాటక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రశ్నపత్రాన్ని రూపొందించారు. తాను అధ్యాపకురాలిగా పనిచేసిన వర్సిటీకే వీసీగా బాధ్యతలు నిర్వర్తించాల్సి రావడం పూర్వ జన్మ సుకృతమని పేర్కొన్నారు. నూతన వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ దేపూరు భారతిని చంద్రగిరి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో పాటు పలువురు కలిసి అభినందనలు తెలిపారు.

ముగిసిన డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రక్రియ

చిత్తూరు రూరల్: జిల్లాలోని దిశా పోలీస్ స్టేషన్‌లో ఔట్ సోర్సింగ్ పద్ధతిలో నియామకానికి డ్రైవర్ పోస్టుల భర్తీ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. చిత్తూరు ప్రశాంత్‌నగర్‌లోని జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో నిర్వహించిన ఈ భర్తీ ప్రక్రియకు జిల్లా నలుమూలల నుంచి 89 మంది హాజరయ్యారు. ట్రాఫిక్ డీఎస్పీ విష్ణు రఘువీర్, డీటీసీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మధుసూధన్‌రావు, ఆర్‌ఐ మధు తదితరులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు రోజులపాటు జరిగిన ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించిన వివరాలను త్వరలో వెల్లడిస్తామని అధికారులు తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల ఫోన్‌కే మెసెజ్‌లు వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా ఉంటుందన్నారు.

క్లుప్తంగా

90 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న రేషన్‌బియ్యం

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): అక్రమంగా తరలిస్తున్న 90 బస్తాల రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన శుక్రవారం తొట్టంబేడు మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. తొట్టంబేడు మండలం, శేషమనాయుడుకండ్రిగ నుంచి టాటాయోధ వాహనంలో 90 బస్తాల(4,910 కిలోలు) రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నట్టు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. దీంతో కాపు కాచి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని, ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో బుచ్చినాయుడుకండ్రిగకు చెందిన భాస్కర్(45) ఉన్నారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని పట్టణంలోని రేషన్‌షాపులో భద్రపరిచారు. విజిలెన్స్ అధికారుల ఫిర్యాదు మేరకు తొట్టంబేడు ఎస్‌ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌ఆర్వో సస్పెన్షన్

దొరవారిసత్రం: దొరవారిసత్రం వన్యప్రాణి విభాగం కార్యాలయంలో ఎఫ్‌బీవో (అసిస్టెంట్ బీట్ ఆఫీసర్) పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఎఫ్‌ఆర్వో వరప్రసాద్‌ను శుక్రవారం సస్పెండ్ చేశారు. డీఎఫ్‌వో శ్యామ్యుల్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక వన్యప్రాణి విభాగంలో ఎఫ్‌బీవోగా విధులు నిర్వర్తిస్తున్న హజ్రత్ ఉన్నీసాపై అక్కడి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ (ఎఫ్‌ఆర్వో) వరప్రసాద్ వారం కిందట అసభ్యకరంగా ప్రవర్తించారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేశారు. దాంతో ఆ శాఖ ఉన్నతాధికారులు ఎఫ్‌ఆర్వో తీరుపై ఓ కమిటీ వేసి విచారణ జరిపించారు. ఈ క్రమంలో ఎఫ్‌ఆర్వో ఆమె పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తేలడంతో ఎఫ్‌ఆర్వోను పీసీసీఎఫ్ మధుసూదన్‌రెడ్డి సస్పెండ్ చేస్తున్నట్లు శుక్రవారం సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగం సబ్ కార్యాలయానికి ఉత్తర్వులను అందజేశారు.

అడుగడుగునా బ్రహ్మరథం

- గడపగడపకు అపూర్వ ఆదరణ
- ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్న మోహిత్‌రెడ్డి

పాకాల: మండల కేంద్రంలో 5వ రోజు గడపగడపకు మహా పాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. అడుగడుగునా చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. శుక్రవారం భారతంమిట్ట, గాంధీనగర్ ప్రాంతాల్లో మహిళలు గజమాలలు వేసి మంగళ హారతులతో తమ అభిమానాన్ని చాటుకున్నారు. ప్రతీ గడపలో శీతల పానియాలు అందిస్తూ ఆప్యాయత కురిపించారు. మోహిత్‌రెడ్డి ప్రజలతో మమేకమై సర్వమత సమ్మేళనానికి ప్రతీకగా స్థానికంగా ఉన్న ఆలయాలు, మసీదులు, చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఎండ తీవ్రత నేపథ్యంలో పాదయాత్రలో పాల్గొన్న పార్టీ శ్రేణులకు, ప్రజలకు మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేశారు. రాత్రి 9 గంటల వరకు పాదయాత్ర కొనసాగించారు. జగనన్న ప్రభుత్వం సంక్షేమానికి పెద్ద పీట వేసిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు చేపట్టారని మోహిత్‌రెడ్డి వివరించారు.



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న మోహిత్‌రెడ్డి

అలుపెరుగని నడక

ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు మోహిత్‌రెడ్డి అలుపెరుగక 12 కిలోమీటర్లు నడిచారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ప్రముఖ రచయిత కలువకొలను సదానంద ఇంటికి వెళ్లారు. ఆయన సతీమణి కస్తూరిబాయ్ మోహిత్‌రెడ్డిని అక్కున చేర్చుకుని ఆశీర్వచనాలు అందించారు. అనంతరం స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించారు. రేషన్‌కార్డు, ఇళ్ల సమస్యలపై సంబంధిత అధికారులతో మాట్లాడారు. సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు.

రేషన్ వాహనం తనిఖీ

రెండు రోజులుగా రేషన్ సకాలంలో అందడం లేదని గడపగడప పర్యటనలో మోహిత్‌రెడ్డికి ఫిర్యాదులు అందాయి. స్పందించిన మోహిత్‌రెడ్డి భారతంమిట్టలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం స్వయంగా బియ్యం తూకం వేసి ప్రజలకు పంపిణీ చేశారు.



మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించిన సదానందం భార్య కస్తూరిబాయ్

బాధ్యతగా పనిచేద్దాం

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా ఎంతో ప్రతిష్టాత్మకంగా సచివాలయం, వలంటరీ వ్యవస్థలను తీసుకొచ్చిందని మోహిత్‌రెడ్డి తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు బాధ్యగా విధులు నిర్వహించాలని కోరారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,340
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,509

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.74,500
రిటైల్ వెండి గ్రాము	రూ.76.50

ఎంఈవో2 పోస్టుల భర్తీకి షెడ్యూల్

చిత్తూరు కలెక్టరేట్ : ఎంఈవో–2 పోస్టుల భర్తీకి ప్రభుత్వం షెడ్యూల్ జారీచేసిందని డీఈవో విజయేంద్రరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 17న జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న సీనియర్ హెచ్‌ఎంల జాబితాను విడుదల చేయనున్నట్లు చెప్పారు. ఈనెల 18న కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. 19న సంబంధిత మండలాల్లో ఎంఈవో–2 విధుల్లో చేరాల్సి ఉంటుందని డీఈవో వెల్లడించారు.

విస్తృతంగా చిరుధాన్యాల సాగు

- రైతుల్లో అవగాహన పెంచాలి
- జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా చిరుధాన్యాల సాగు విస్తృతం చేసేలా రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జా యింట్ కలెక్టర్ శ్రీనివాసులు అధ్యక్షతన జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశం జరిగింది. మండలి చైర్మన్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్ రెడ్డి వ్యవసాయాభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాలతో సంవత్సరానికి రూ.13,500 అందజేస్తున్నారని, పంటల బీమా, పంటల నష్టపరిహారం, ఎరువులు, విత్తనాల సరఫరా, సాగు యాంత్రీకరణ పరికరాలు రాయితీపై అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను రైతులు వినియోగించుకుని అభివృద్ధి చెందుతున్నట్లు చెప్పారు. ప్రతి రోజూ మామిడి ధరలను మార్కెట్‌లో ప్రజలకు తెలిసేలా నోటీస్‌బోర్డుల్లో ప్రదర్శించాలన్నారు. వివిధ ఉద్యాన పంటల సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని తెలిపారు.

ఆర్‌బీకేలు అండ

ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయ పరిధిలోనే రైతు భరోసా కేంద్రాలు ప్రభుత్వం ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలుస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల పక్షపాతి అని పేర్కొన్నారు. జిల్లాలో వర్షాలు బాగా పడడం వల్ల వ్యవసాయానికి నీరు సమృద్ధిగా ఉన్నట్లు చెప్పారు. స్వయంగా వ్యవసాయ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి పంటలను పరిశీలించి, రైతులకు అవసరమైన సలహాలు అందజేయాలన్నారు. పలమనేరు–కుప్పం–మదనపల్లె అర్బన్ డెవలప్మెంట్ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ పడమటి ప్రాంతాలలో చిరుధాన్యాలు పండించే రైతులను అధికారులు ప్రోత్సాహించాలని తెలిపారు. టమాటా మార్కెట్లో దళారీ వ్యవస్థపై అధికారులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

మామిడిని విడతల వారీగా కోయాలి

జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మామిడి పంటను డిమాండ్ బట్టి విడతల వారీగా కోస్తే మంచి ఆదాయం వస్తుందని తెలిపారు. జిల్లాలో 4 వేల హెక్టార్లలో రాగి సాగు చేస్తున్నారని, సాగు విస్తీర్ణం పెంచాలని అధికారులకు సూచించారు. రాగి సాగుకు ప్రభుత్వం రాయితీలు కూడా ఇస్తోందని తెలిపారు. జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మధుసూదన్ రెడ్డి, జిల్లా పట్టు పరిశ్రమ శాఖ అధికారి శోభారాణి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ ప్రభాకర్, ట్రాన్స్‌కో ఈఈ హరి, ఏపీఎంఐపీ పీడీ రమణా రెడ్డి, డ్వామా పీడీ గంగభవాని, పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్ యజమానులు గోవర్ధన్ బాబి పాల్గొన్నారు.

కండలేరు జలాలను సద్వినియోగం చేసుకోండి



తెలుగుగంగ కాలువను పరిశీలిస్తున్న ఎస్‌ఈ హరినారాణరెడ్డి

రాపూరు: కండలేరు జలాశయం నుంచి విడుదలైన జలాలను నెల్లూరు, చిత్తూరు వాసులు సద్వినియోగం చేసుకోవాలని తెలుగుగంగ ఎస్సీ హరినారాయణరెడ్డి సూచించారు. రాపూరు మండలం, కండలేరు జలాశయాన్ని శుక్రవారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు జలాశయం నుంచి ప్రవహిస్తున్న సత్యసాయిగంగ కాలువను పరిశీలించినట్లు తెలిపారు. రెండు జిల్లాల్లో 2 లక్షల ఎకరాలు రెండో పంటకు కండలేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎక్కడా నీటి వృథాకాకుండా అధికారులు నిరంతరం కాలువను పరిశీలిస్తుండాలని ఆదేశించారు. ప్రస్తుతం కండలేరు జలాశయంలో 25.635 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 2,100 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 50, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 70, లోలెవల్ స్లూయిస్‌కు 230 క్యూసెక్కుల వంతున విడుదలచేస్తున్నట్లు తెలిపారు. అంతకముందు కండలేరు జలాశయం, హెడ్‌రెగ్యులేటర్, పికప్ ఏరు నుంచి సత్యసాయి గంగ కాలువ 67వ కిలోమీటర్ వరకు తెలుగుగంగ కాలువను పరిశీలించారు.

ఆయన వెంట ఈఈలు విజయకుమార్‌రెడ్డి, సత్యప్రసాద్, రాధాకృష్ణమూర్తి, డీఈలు సుబ్రమణ్యేశ్వరావు, నాగేశ్వరావు, శ్రీనివాసకుమార్, బాబయ్య, ఏఈలు తిరుమలయ్య, గోపీకృష్ణ తదితరులు ఉన్నారు.

ఘనంగా చాటు పొంగళ్లు



చాటు పొంగళ్లు పెడుతున్న భక్తులు

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట చెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాల అనంతరం వచ్చే మొదటి శుక్రవారం సందర్భంగా పట్టణ వాసులు భక్తిశ్రద్ధలతో చాటుపొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పొంగళ్లు పెట్టుకునే భక్తులకు ఆలయ పాలక మండలి చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కల్యాణ మండపం వద్ద పందిళ్లు వేసి మట్టి పొయ్యిలు ఏర్పాటు చేశారు. ఉచితంగా కట్టెపుల్లలు అందజేశారు. ఆలయ ఆవరణలోని శూలం వద్ద అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేసి నైవేద్యం సమర్పించారు. పొంగళ్లు పెట్టుకున్న అనంతరం ఆలయంలోని అమ్మవారి మూలవిరాట్టు దర్శనం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులు బారులు తీరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(ఫైల్)

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం, కాలూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రగిరి మండలం నరసింగాపురానికి చెందిన వ్యక్తి మృతి చెందాడు. స్థానిక వివరాల మేరకు.. చంద్రగిరి మండలం, నరసింగాపురం గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (38) తిరుమలలో ఓ దుకాణం నిర్వహిస్తూ వ్యాపారం చేసుకుని జీవనం సాగించేవాడు. గురువారం రాత్రి తిరుమల నుంచి ఇంటికి స్కూటర్ పై తిరిగి వస్తుండగా తిరుపతి రూరల్ మండలం, కాలూరు సమీపంలో ఓ మతిస్థిమితం లేని వ్యక్తి ఎదురుగా వస్తుండడంతో అతన్ని తప్పించబోయి స్కూటర్ అదుపుతప్పి బోల్తాపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయం కాగా 108 సిబ్బంది చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చంద్రశేఖర్ రెడ్డి మృతి చెందాడు. మృతుడికి భార్య స్వప్న, కుమారుడు భానుప్రకాష్‌రెడ్డి, కుమార్తె హిమశ్రీ ఉన్నారు. దీనిపై తిరుపతి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుబ్రమణ్యంరెడ్డి తెలిపారు.

పది ఎర్రచందనం దుంగలు స్వాధీనం

కలువాయి: ఎర్రచందనం అక్రమ రవాణా స్థావరంపై గురువారం రాత్రి రాపూరు అటవీశాఖ అధికారులు దాడులు నిర్వహించారు. కలువాయి మండలం, కోటూరుపల్లి చెరువు నుంచి లోడ్డుచేసి కారులో తరలిస్తుండగా రాపూరు రేంజర్ పి.రవీంద్రబాబు, గోనుపల్లి డీఆర్వో మస్తానయ్య తమ సిబ్బందితో దాడిచేశారు. అధికారులను చూసి దొంగలు వాహనాన్ని వదిలి పరారయ్యారు. హోండో అమేజ్ కారుతో సహా అందులో ఉన్న 10 ఎర్రదుంగలను స్వాధీనం చేసుకుని ఆదూరుపల్లిలోని అటవీ శాఖ గోదాముకు తరలించారు. వీటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో ఎఫ్‌బీఓలు జనార్దన్, నాగులు, ప్రవీణ్, ఫరీద్, శ్రీనివాసులు, బేస్‌క్యాంపు, స్ట్రైకింగ్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు, వాహనంతో అటవీశాఖ అధికారులు

గ్రేట్ ప్లేస్ టు వర్క్ అవార్డు గెలుచుకున్న అమరరాజ

రేణిగుంట: ఉద్యోగులందరికీ సానుకూలమైన పని వాతావరణాన్ని అందించి దేశంలోనే అత్యుత్తమ జాబితాలో రేణిగుంట మండలం, అమరరాజ బ్యాటరీస్ కర్మాగారం 2023వ సంవత్సరానికి గాను 55వ ర్యాంకును సాధించినట్లు ఆ సంస్థ ఈడీ గొరినేని హర్షవర్ధన్ శుక్రవారం తెలిపారు. గ్రేట్ ప్లేస్ టు వర్క్ ఇన్‌స్టిట్యూట్ ప్రతి ఏటా పలు బహుళజాతి సంస్థల్లో పనిచేసే ఉద్యోగులకు కల్పించే సానుకూల వాతావరణం గురించి అధ్యయనం చేసి ర్యాంకులను ప్రకటించేది. శుక్రవారం దేశ వాణిజ్య రాజధాని ముంబయిలో ర్యాంకుల ప్రకటనతోపాటు అవార్డులు, ప్రశంసాపత్రాలను కంపెనీ ప్రతినిధులు అందుకున్నారు. అమరరాజ సంస్థల ఈడీ గొరినేని హర్షవర్ధన్ మాట్లాడుతూ అమరరాజ బ్యాటరీస్ కంపెనీలో ఉద్యోగులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన సౌకర్యాలతో వారి 100 శాతం సామర్థ్యాన్ని ప్రదర్శించదగ్గ సానుకూల వైఖరిని కల్పిస్తున్నట్లు తెలిపారు. అమరరాజ గ్రూప్ హెచ్‌ఆర్ చైర్మన్ జైకృష్ణ, ఏఆర్‌బీఎల్ ఆపరేషన్స్ ఆఫీసర్ సి.నరసింహులునాయుడు, శ్రీధర్, మనీష్ తులీ, రామూర్తి, శేఖర్ తదితరులు అవార్డును స్వీకరించారు.



ముంబయిలో అవార్డును స్వీకరిస్తున్న అమరరాజ బ్యాటరీస్ కంపెనీ ప్రతినిధులు

30 లోపు జనన ధ్రువీకరణ పత్రాలు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో 0–5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ జనన ధ్రువీకరణ, ఆధార్ నమోదు చేయించి అందజేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ పలు శాఖల అధికారులతో కలెక్టర్ వరుస సమీక్షలను నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జనన ధ్రువీకరణ పత్రాలు అందేలా ఐసీడీఎస్, వైద్య ఆరోగ్యశాఖ సమన్వయంతో పని చేయాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి ఆ కుటుంబ సభ్యుల ఆరోగ్య స్థితిగతులు సంపూర్ణంగా నమోదు చేయాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో హార్టీకల్చర్ ఆఫీసర్ మధుసూదన్ రెడ్డి, ఇన్చార్జి డీఎంఅండ్‌హెచ్‌ఓ రాజశేఖర్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ నాయక్, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ మెడికల్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో చేర్పులు పరిశీలిస్తాం

జిల్లాలో ఓటర్ల జాబితాలో చేరికలు, తొలగింపుల ప్రక్రియను మరోసారి పరిశీలించి జాబితాను సిద్ధం చేస్తామని కలెక్టర్ షణ్మోహన్ అన్నారు. శుక్రవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఓటర్ల జాబితా ప్రక్రియపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 7 నియోజకవర్గాల్లో ఇప్పటి వరకు ఫారం 6 క్లెయిములు 10,885 అందగా వాటిలో 2,065 పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. ఫారం–7 లో 6,380 క్లైములు అందగా 1,483 క్లైములు, ఫారం–8 2,666 క్లైములు అందగా 572 క్లైములు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. జిల్లాలో వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఓటర్లు 155 మంది, యువ ఓటర్లు 8312 మంది, హిజ్రాలు 109 మంది ఉన్నారని కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో రాజశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్